

నేడు యథావిధిగా 'ప్రజాసమస్యల పరిష్కార వేదిక'

ప్రజాశక్తి-రాయచోటి

ప్రజల నుంచి వారి సమస్యలను స్వీకరించి, వాటిని పరిష్కరించేందుకు ఈనెల 30న సోమవారం ఉదయం 10 గంటల నుంచి ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని జిల్లా కేంద్రం రాయచోటి తో పాటు గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో యథావిధిగా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ శ్రీధర్ చామకూరి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు తమ విజ్ఞప్తులను సంబంధిత గ్రామ, మండల, డివిజన్లలో అధికారులకు ఇవ్వాలని ఆయన సూచించారు. మండల, డివిజన్ స్థాయిలో సమస్యలు పరిష్కారం కాని అర్జీదారులే జిల్లా కేంద్రంలో జరిగే ప్రజా సమ స్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి రాగలరని తెలిపారు.

25 నుంచి 108 ఉద్యోగుల నిరవధిక సమ్మె

- సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రామాంజులు

మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ. రామాంజులు

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

108 సర్వీస్‌లో పని చేస్తున్న ఉద్యోగుల దీర్ఘకాలిక సమస్యలు పరిష్కారం కానందున ఈ నెల 25 నుంచి నిరవధిక సమ్మెకు సిద్ధమైనట్లు సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ. రామాంజులు పేర్కొన్నారు. ఆదివారం స్థానిక జూనియర్ కళాశాలలో108 ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 108 అత్యవసర సర్వీను నిర్వహించే ప్రతి ప్రయివేట్ యాజమాన్యం ఇఎంటి, పైలట్లు గ్రాట్యూటీ ఎర్న్డ్ లీవు అమౌంట్ వార్షిక ఇంక్రిమెంట్లు వంటివి చెల్లించకుండా వైదొలగడంతో ఉద్యోగులు ఆర్థికంగా తీవ్రంగా నష్టపోతున్నారని పేర్కొన్నారు. కావున ప్రభుత్వమే 108 సర్వీస్‌ను నిర్వహించాలన్నారు. ప్రతి నెలా సకాలంలో వేతనాలు అందక ఇక్కట్లకు గురవుతున్నారని 2017లో టిడిపి ప్రభుత్వం జిఒ 49 ప్రకారం ప్రతి నెలలా ఇచ్చే రూ. 4000 వైసిపి ప్రభుత్వం రద్దు చేయడం దారుణమని, వెంటనే పునరుద్ధరించాలని తెలిపారు. సిబ్బంది రోజుకు 12 గంటలు కాకుండా, మూడు షిఫ్ట్‌లలో పని చేయించి ఎనిమిది గంటల పని విధానం అమలు చేసి ఒత్తిడి తగ్గించాలని కోరారు. పెండింగ్‌లోని ఇంక్రిమెంట్స్ విడుదల చేయాలన్నారు. సిఐటియు జిల్లా కార్యదర్శి డి. భాగ్యలక్ష్మి మాట్లాడుతూ స్లాబ్స్ రద్దు చేసి, సహజ మరణం చెందిన వారికి రూ.20 లక్షలు ఎక్స్ గ్రేషియో ఇవ్వాలని, పిఎఫ్ సొమ్ము మొత్తాన్ని యాజమాన్యం చెల్లించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని తెలిపారు. మండలకేంద్రంలో పనిచేసే సిబ్బందికి ముఖ్యంగా మహిళలకు రెస్ట్ రూమ్‌లు ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. 108 సర్వీస్ యూనియన్ జిల్లా అధ్యక్షులుగా రమణ, ప్రధాన కార్యదర్శిగా చలపతి, కోశాధికారిగా యోగనందరెడ్డి, మరో పది మందిని కమిటీ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నుకొన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో 108 ఉద్యోగులు యర్రన్న, జయరాం, శివానంద రెడ్డి, వెంకట్రామిరెడ్డి, ప్రసాద్, దామోదరం బ్రహ్మానందరెడ్డి, అజమ్ తుల్లాబేగ్, చంద్ర మౌళి, రహమతుల్లా, అమరనాద్ బాబు, ప్రసాద్ రాజు పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ అమలులో ప్రభుత్వం విఫలం

-డిసిసి అధ్యక్షులు గాజుల భాస్కర్

మాట్లాడుతున్న గాజుల భాస్కర్

ప్రజాశక్తి-రాయచోటి

ఎన్నికల సమయంలో సూపర్ సిక్స్ హామీల పథకాల అమలు చేయడం లో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు గాజుల భాస్కర్ పేర్కొన్నారు. ఆదివారం మదనపల్లి రోడ్‌లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ అధికారంలోకి రాకముందు ప్రజలను మభ్యపెట్టి ఎన్నో రకాల హామీలను ఇచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారంలోకి రాగానే హామీలను మరిచారని అన్నారు. 16 వేలకు పైగా ఉద్యోగాలతో మెగా డిఎస్‌సి అని చెప్పి పరీక్షలు జరపకుండా వాయిదాలు వేసుకుంటూ కాలయాపన చేస్తూ నిరుద్యోగులను మోసం చేస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో అధికారంలో వున్న కూటమి ప్రభుత్వం, వైసిపి దొందూ దొందేనే అన్నారు. వైసిసి ప్రభుత్వం అప్పులు చేసి కుప్పలు పెడితే టిడిపి కూటమి ప్రభుత్వం అమలుకు సాధ్యం కానీ హామీలను ఇచ్చి ప్రజలను మభ్యపెడుతున్నారన్నారు. ఇటీవల అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో నిరుద్యోగ భృతి ఊసే లేక పోవడం బాధాకరమన్నారు. తల్లికి వందనం హామీకి రూ.12,600 కోట్లు కావాల్సి వుండగా బడ్జెట్లో కేవలం రూ.5,387 కోట్లు మాత్రమే కేటాయింపు చేయడం చూస్తే ఆ పథకం అమలు ప్రశ్నార్థకమేనని అన్నారు. అన్నదాత సుఖీభవ పథకం అమలు చేయాలంటే రూ.10,717 కోట్లు అవసరం ఉండగా రూ.4,500 కోట్లు మాత్రమే కేటాయించడం వెనుక ఉన్న ఆంతర్యం ఏమిటని ఆయన ప్రశ్నించారు. అధికారంలోకి వచ్చిన వెంటనే మహిళలకు ఉచిత బస్సు పథకాన్ని ప్రవేశ పెడతామని గొప్పలు చెప్పి నేటికీ మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ పథకానికి బడ్జెట్‌లో కేటాయింపులు చేపట్టకపోవడం బాధాకరమన్నారు.సంవత్సరానికి మూడు సిలిండర్ల చొప్పున ఉచిత గ్యాస్ అందిస్తామని చెప్పి ఆర్భాటంగా దీపావళి పండుగ రోజున ఉచిత గ్యాస్ పథకాన్ని ప్రారంభించినప్పటికీ ఇప్పటివరకు లబ్ధిదారుల ఖాతాల్లో నగదు కనీసం 10 శాతం కూడా జమ కలేదుని ఆరోపించారు. ఎస్‌సి, ఎస్‌టి,బిసి, మైనార్టీలకు 50 ఏళ్లకే పెన్షన్ పథకానికి బడ్జెట్‌లో కేటాయింపులు చేయలేదన్నారు.రైతులకు పెట్టుబడి సా యం కింద రూ.20 వేలు ఇస్తానని చెప్పి ఇంతవరకు రైతులకు పెట్టుబడి సా యం ఇవ్వకపోవడం రైతులను మోసం చేయడమేనన్నారు.ఎన్నికల సమ యంలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను వెంటనే అమలు చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.లేని పక్షంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ఆయన హెచ్చరించారు.

వాల్మీకుల పట్ల చిన్నచూపు తగదు

వర్క్‌షాప్‌కు హాజరైన వాల్మీకి నాయకులు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

వాల్మీకుల పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల చిన్నచూపు తగదని వాల్మీకి, బోయ నేతలు వ్యాఖ్యానించారు. ఆదివారం వాల్మీకి నేత నాగినేని గోవింద్ నేతృత్వంలో దేశాయ్ పంక్షన్‌లో ఎస్‌టి సాధన సాధ్య సాధ్యాలపై వర్క్ షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా వాల్మీకి రాష్ట్ర నాయకులు నాగినేని గోవిందు, క్రాంతి నాయుడు, జక్కుల శ్రీనివాసరావు, బొమ్మనపల్లి లక్ష్మన్న మాట్లాడుతూ గిరిజన రిజర్వేషన్ల అంశంలో ఏ జాతికి లేని అశాస్త్రీయమైన ఏజెన్సీ, మైదాన ప్రాంతం అనే నిబంధన వాల్మీకి బోయల రిజర్వేషన్ల అమలులో మాత్రం ఎందుకని ప్రశ్నించారు. వాల్మీకుల రిజర్వేషన్ల అంశంలో రాజ్యాంగం అధికరణలు 14,15,16, 29(1), 342 లను అమలు పరచాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు 2024 ఎన్నికల ముందు వాల్మీకి బోయలకు ఇచ్చిన గిరిజన రిజర్వేషన్ల హామీని అమలు చేయాలని కోరారు. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రొఫెసర్ సత్యపాల్ కమిటీ, కారం శివాజీ కమిటీ రిపోర్టు ఆధారంగా వాల్మీకి బోయలను గిరిజన తెగల జాభితా లో చేరుస్తామని గత ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలన్నారు. 2019 కర్నూలు సభలో బోయల బాధ తనకు తెలుసని బిజెపి అధికారంలోకి వచ్చిన వెంటనే తగు న్యాయం చేస్తామని దేశప్రదాని నరేంద్రమోది హామీ ఇచ్చి 11 ఏళు గడిచాయని గుర్తు చేశారు. ఇంత వరకు వాల్మీకి బోయల గిరిజన రిజర్వేషన్ల ఆం శంలో కేంద్రప్రభుత్వం ఎటువంటి నిర్ణయం తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రం లో ఏ గిరిజన తెగకు లేని ప్రాజతీయ వివక్ష కేవలం వాల్మీకులకు అమలు చేయడం రాజ్యాంగ ఉల్లంఘన క్రిందకు వస్తున్నదని ఇకనైన ఈ కూటమి ప్రభుత్వం వాల్మీకి బోయలకు ఎస్‌టి జాబితాలో చేర్చాలని డిమాండ్ చేశారు. అనంతరం ఇటీవల రాష్ట్ర వాల్మీకి సంఘం డైరెక్టర్‌గా నియమితులైన మండెం ప్రభాకర్ ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, బి.కొత్తకోట మహేష్, కురబలకోట వాల్మీకి సంఘం నాయకులు రామ్మూర్తి, మల్లికార్జున, కుపలా క్రిష్ణ, ఓబులేష్, హరి ప్రసాద్, నాగరాజు, నరసింహులు, జశ్వంత్ పాల్గొన్నారు.

సేవే పరమావధిగా వాసవి క్లబ్ ఇంటర్నేషనల్

సమావేశంలో విజయ సూచిక చూపుతున్న క్లబ్ ప్రతినిధులు

ప్రజాశక్తి-పీలేరు

వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ డిస్టిక్ వి211ఎ సేవే పరమావధిగా ప్రజల కోసం పనిచేస్తోందని నిర్వాహకులు తెలిపారు. ఆదివారం పీలేరు ఆర్యవైశ్య కల్యాణ మండపంలో క్లబ్ జిల్లా సమావేశం నిర్వహించారు. సోమిశెట్టి లీలా సురేష్ ప్రారంభించిన సమావేశానికి గవర్నర్ సోమిశెట్టి సురేష్‌బాబు అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిలుగా వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ కార్యదర్శి హెచ్‌ఎస్ నాగభూషణ, పరిశీలకులు శ్రీనివాసరావు కార్యక్రమంలో హాజరై స్థానిక ఆర్యవైశ్య కల్యాణమండపానికి 100 కుర్చీలను వితరణగా అందజేశారు. సీడ్ బాల్స్ తయారుచేసి చెట్లు పెంచే కార్యక్రమంలో సాధించిన విజయాన్ని గుర్తించిన వాసవి క్లబ్స్ ఇంటర్నేషనల్ 16 కుట్టుమిషన్లు కేటాయించగా వాటిని లబ్ధిదారులకు గవర్నర్ చేతుల మీదుగా అందజేశారు. ఈ డిస్ట్రిక్ నుండి 2024వ సంవత్సరంలో సేవా కార్యక్రమాలకు రూ.36,87,247 మేరకు ఖర్చు చేసినట్లు గవర్నర్ తెలియజేశారు. పీలేరు వాసవి క్లబ్ గ్రేటర్, వాసవి కపుల్స్ క్లబ్ 164 సేవా కార్యక్రమాలు చేసి జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిచాయని అన్నారు. కార్యక్రమంలో వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ ఐఈసి అధికారులు ముల్లంగి విజయ్ కుమార్, ఇస్స నాగలక్ష్మి, వెలవలూరి వెంకటేష్, ఐపీసీ రమ్య రమేష్, తేజ యశస్వి గుప్తా, వైస్ గవర్నర్లు పామిడి నాగరాజ, క్యాబినెట్ కార్యదర్శి పులిరాజ, ఆనంద్, క్యాబినెట్ ట్రెజరర్ ఆమూరి మహీధర్, రీజన్ ఛైర్ పర్సన్లు పామిడి జయచంద్ర, ఓఆర్ నాగేంద్ర, పి. బాలాజీ, జోన్ ఛైర్పర్సన్ జూటూరు అరవింద్ బాబు, నరేంద్ర, సకల రమేష్, రీజనల్ సెక్రెటరీ గ్రంధి నరసింహులు, జిల్లా అధికారులు సకలహరి భరత్, పిఆర్‌ఓ పూనా ప్రభాకర్ శెట్టి, తులసి, 24 మంది వివిధ క్లబ్ ల అధ్యక్షులు, కార్యదర్శులు, కోశాధికారులు, సభ్యులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

విజేతలకు బహుమతులు ప్రదానం

ప్రజాశక్తి - కడప అర్బన్

జిల్లా పేరును పాటు జాతీయ స్థాయితో నిలబెట్టాలని యోగి వేమన యూనివర్సిటీ విసి కృష్ణా రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం వైవీయూలో నిర్వహించిన జిల్లా స్థాయి యువ ఉత్సవాలలో తమ ప్రతిభను నిరూపించుకుని గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. భారత ప్రభుత్వం యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వశాఖ, నెహ్రూ యువ కేంద్ర ఆధ్వర్యంలో యువ ఉత్సవ్ లో (ఇండియా -2047) భాగంగా పలు అంశాల్లో నిర్వహించిన విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. . ముగింపు కార్యక్రమంలో యువ అధికారి మణికంఠ, ఎన్ఎస్ఎస్ కో- ఆర్డినేటర్ వెంట్రామిరెడ్డి, ప్రొఫెసర్ విజయ భారతి న్యాయ నిర్ణేతలు, పలు స్వచ్ఛంద సంస్థల ప్రతి నిధులు, జిల్లా నుంచి సుమారు 700 మంది యువత, నెహ్రు యువ కేంద్ర, వైవీయూ యువ కేంద్ర అధికారి మణికంఠ పాల్గొన్నారు.

విజేతలతో వైవీయూ విసి, నెహ్రూ యువకేంద్రం నిర్వాహకులు

పట్టణ అభివృద్ధే ధ్యేయం

మున్సిపల్ కమిషనర్ వాసు బాబు

ముఖా ముఖి..

ప్రజాశక్తి-రాయచోటి

రాయచోటి పట్టణ అభివృద్ధే ధ్యేయమని మున్సిపల్ కమిషనర్ వాసుబాబు పేర్కొన్నారు. రాయచోటి మున్సిపాలిటీ పరిధిలో అభివృద్ధి పనులు, పారిశుధ్యం, డ్రెయినేజీ తదితర అంశాలను ఆయన ప్రజాశక్తికి ఇచ్చిన ముఖాముఖిలో వివరించారు.

మున్సిపాలిటీలోని వార్డులు, గృహాలు, జనాభా వివరాలు తెలపండి?

రాయచోటి మున్సిపాలిటీ పరిధిలో మొత్తం 34 వార్డులు, 32,855 గృహాలు, 1,06,000 జనాభా కలదు. వారందరికీ మౌలిక వసతులు కల్పించడానికి కృషి చేస్తున్నాం.

పట్టణంలో ప్లాస్టిక్ నివారణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

పట్టణంలో ప్లాస్టిక్ నివారణ కోసం వారానికి రెండు సార్లు కమర్షియల్ షాపులపై రైడింగ్ చేస్తూ 75 మైక్రాల కంటే తక్కువ గల ప్లాస్టిక్‌ను వినియోగిస్తున్న దుకాణాల యజమానులపై జరిమానా విధిస్తున్నాం. వ్యాపారులకు నోటీసులు ఇచ్చి వారి లైసెన్సును రద్దు చేస్తున్నాం. స్కూల్, కాలేజీలు, విద్యాసంస్థలు, ప్రజా రద్దీ గల ప్రాంతాల్లో ప్లాస్టిక్‌ను వినియో గించకుండా అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తున్నాం.

ఫ్లెక్సీల నియంత్రకు ఎటువంటి చర్య తీసుకుంటున్నారు?

ఫ్లెక్సీలు తయారు చేస్తున్న షాపు యజమానులకు నోటీసులు జారీ చేసి ప్లాస్టిక్ ఫ్లెక్సీల బదులుగా క్లాత్ బ్యానర్లు తయారు చేసే విధంగా వారిని ప్రోత్సహిస్తున్నాం.

పట్టణంలో కుక్కలు, పశువులు నిర్మూలనకు ఏ టువంటి చర్యలు తీసుకుంటున్నారు?

పట్టణంలో వీధి కుక్కల నియంత్రణకు వాటికి స్టెరిలైజేషన్, ఆంటీ రేబిస్ ఇంజక్షన్ చేయిస్తున్నాం. వీధి పశువుల యజమానులకు పశువులు రోడ్లపై తిర గకుండా నోటీసులు జారీ చేస్తున్నాం. వాటిని పట్టణ ప్రాం తాలకు దూరంగా తరలించేలా చర్యలు తీసు కుంటున్నాం.

అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ పనులు ఎంతవరకు చేశారు?

పట్టణంలో ఇప్పటివరకు అండర్ డ్రెయినేజీ పనులు 10 శాతం మాత్రమే పనులు పూర్తి చేశారు. మిగిలిన పనులు కాంట్రాక్టర్‌తో మాట్లాడి వేగవంతం చేయడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నాం.

పట్టణ అభివృద్ధికి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

పట్టణం అభివృద్ధి కోసం ముందుగా మౌలిక వసతులు కల్పిస్తూ రోడ్ల విస్తరణ, తాగునీటి సరఫరా వంటి వాటిపై దృష్టి సారిస్తున్నాం. పార్కులు, డివై డర్‌లు, సెంట్రల్ లైటింగ్, సుందరీకరణ వంటి అభివృద్ధి పనుల పై దృష్టి సారించాం.

ప్రజలకు ప్రభుత్వ పథకాలు ఎలా అందించాలనుకుంటున్నారు?

పట్టణంలోని ప్రతి వార్డులో సర్వే చేయించి, అర్హులను గుర్తించి, ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటున్నాం.

పట్టణ ప్రజలకు సలహాలు, సూచనలు ఏమైనా ఇవ్వాలనుకుంటున్నారా?

పట్టణ ప్రజలు బహిరంగ ప్రదేశాల్లో చెత్తను వేయకుండా పురపాలక వాహనాలకు చెత్తను అందించాలి. ప్లాస్టిక్‌ని వినియోగించకుండా పర్యావరణ కాలుష్య నివారణకు సహకరించాలి. సకాలంలో పన్నులు చెల్లించి పట్టణ అభివృద్ధికి అందరూ సహకరించాలి.

కరాటేలో సత్తాచాటిన విద్యార్థులు

- 8 పతకాలు కైవసం

పతకాలతో మదనపల్లె యూత్ కరాటే క్లబ్ విద్యార్థులు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

తమిళనాడు రాష్ట్రం ఊటీలో నిర్వహించిన కరాటే పోటీలలో మదనపల్లె యూత్ కరాటే అండ్ స్పోర్ట్స్ విద్యార్థులు ప్రతిభ చాటి మూడు పంకాలు కైవసం చేసుకున్నారు. రాణించిన యూత్ కరాటే క్లబ్ విద్యార్థులను ఒకినోవా గోజురియో కరాటే డూ ఫెడరేషన్ వ్యవస్థాపకులు మహాగురు సోకేసార్ కె.అనంతన్, గ్రాండ్ మాస్టర్ డాక్టర్ ఎఆర్.సురేష్ అభినందించారు. ఈనెల 16న ఊటీ అన్నా స్పోర్ట్స్ ఇండోర్ స్టేడియంలో రైజింగ్ గోజు కరాటే స్కూల్ ఆధ్వర్యంలో 2వ అంతర్జాతీయ స్థాయి ఓపెన్ కరాటే ఛాంపియన్‌షిప్-2024 పోటీలు నిర్వహించారు. 13ఏళ్ల కటా విభాగంలో ఎస్. కాలేషా మస్తాన్, 18ఏళ్ల కటా విభాగంలో ఎస్.మహబల్ రహిమాన్, 6 ఏళ్ల కటా విభాగంలో డిఎ.హేమంష్, 13ఏళ్ల కటా విభాగంలో కె.చరణ్ తేజ ప్రథమ స్థానాలు కైవసం చేసుకున్నారు. 12 ఏళ్ల కటా విభాగంలో ఎస్.మహమ్మద్ హైమాన్ ద్వితీయ స్థానం, 10ఏళ్ల కటా విభాగంలో కె.ధనుష్ కుమార్ రెడ్డి, 16ఏళ్ల కటా విభాగంలో ఎస్. జైత్ర మాధుర్, 7ఏళ్ల కటా విభాగంలో ఎం.అమీన్ అబ్దుల్లా తృతీయ స్థానాలు సాధించారు. విద్యార్థులకు అనంతన్ చేతుల మీదుగా బహుమతులు, ప్రశంసాపత్రాలు, బ్లాక్‌బెల్ట్ సర్టిఫికెట్లు అందజేసి అభినందించారు. ఆరేళ్ల చిన్న వయసులో హేమంష్ షో డాన్ 1వ డిగ్రీ బ్లాక్ బెల్ట్ సాధించగా, పదేళ్ల కె.తనష్ కుమార్‌రెడ్డి షో డాన్ 1వ డిగ్రీ బ్లాక్ బెల్ట్ సాధించడం అభినందనీయమన్నారు.

కరాటే ద్వారా ఆత్మస్థైర్యం, మానసిక వికాసం

కరాటే ద్వారా ఆత్మస్థైర్యం, మానసిక వికాసం కలుగుతుందని యూత్ కరాటే క్లబ్ వ్యవస్థాపకులు కరాటే గ్రాండ్ మాస్టర్ డాక్టర్ ఎ.ఆర్.సురేష్ తెలిపారు. ప్రస్తుత సమాజ పరిస్థితులలో విద్యార్థులు తప్పనిసరిగా కరాటే విద్యను నేర్చుకోవాలని సూచించారు. కరాటే ద్వారా మహిళలకు అత్యవసర పరిస్థితులలో ఆత్మరక్షణకు ఎంతో ఉపయోగకరంగా వుంటుందన్నారు. విద్యార్థులు చదువుతో పాటు, ఆటపాటల్లో కూడా రాణించాలని అన్నారు. , తమ పిల్లలకు చిన్న వయసు నుంచే కరాటే శిక్షణ ఇప్పించడం ద్వారా పిల్లలకు ఆరోగ్యం, ఆత్మరక్షణ, ఆత్మసైర్యం, ఆత్మ విశ్వాసం, శారీరక ధృఢత్వం, ఏకాగ్రత, క్రమశిక్షణ అలవడుతుందన్నారు.

అలరించిన కవి సమ్మేళనం

బహుమతులు అందుకున్న విద్యార్థులు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

కవిత్వంలోని మాధుర్యం ఆస్వాదిస్తేనే తెలుస్తుందని బిటి కళాశాల విశ్రాంత కరస్పాండెంట్ వై.ఎస్.మునిరత్నం అన్నారు. ఆదివారం 57వ గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకొని కవి సమ్మేళనాన్ని ఏర్పాటు చేశారు. గ్రంథాలయ అధికారిణి ఆర్.వసంత కుమారి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ కవులు చుక్కానిలాంటి వారని, కవిత్వంలోని మాధుర్యం ఆస్వాదిస్తేనే తెలుస్తుందని అన్నారు. అనంతరం మునిగోపాలకృష్ణ మాట్లా డుతూ తనకు కవితలు చదవడం, వినటం పట్ల ఎంతో ఆసక్తి ఉన్న నేపథ్యంలో ఈ కార్యక్ర మానికి హాజరవడం జరిగిందని చెప్పారు. అనంతరం జ్ఞానోదయ స్కూల్ ప్రిన్సిపల్ ప్రసాద్ మాట్లా డుతూ ప్రతిరోజూ పుస్తకంలో పది పేజీలు చదివితే జ్ఞానంతో ప్రతి వ్యక్తి జీవితం మారుతుందని అన్నారు. ఇక్కడున్న వారందరూ పుస్తకపఠనం పట్ల ఆసక్తి ఉన్నవారేనని అన్నారు.టిఎస్ఎ కృష్ణ మూర్తి సులో పక్యనం కథ చదివి ఆకట్టుకున్నారు. కవులు హసీనా బేగం, వి.వి.ప్రసాద్, వి.వి.నాగరాజ, ప్రసాద్ శర్మ, యుగంధర అచారి, కుమారస్వామి, వాసుదేవరావు, ప్రొఫెసర్ బి.శ్రీని వాసులు, హేమలత, నాగభూషణం, జి.రామ్మోహన్ నాయుడు, గాయత్రి దేవి, వాసా కృష్ణమూర్తి, రాఘవేంద్రరావు, ముని రత్నం తమ కవితలను చదివి వినిపించారు. జ్ఞానోదయ పాఠ శాలలో నిర్వహించిన వ్యాసరచన పోటీలో విజేతలైన పిల్లలకు బహుమతులు ప్రదానం చేశారు. కవులు, రచయితలకు గ్రంథాలయం తరపున శాలువా, పుస్తకాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్ర మంలో జ్ఞానోదయ పాఠశాల పిల్లలు, ఉపాధ్యాయులు, పాఠకులు, గ్రంథాలయ సిబ్బంది శిరీష, జయమ్మ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు చెక్కును అందజేస్తున్న వెంకటేష్

ఎన్‌టిఆర్ విగ్రహ ఏర్పాటుకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మదనపల్లె పట్టణంలో ఎన్‌టిఆర్ విగ్రహ ఏర్పాటుకు రూ.లక్ష విరాళాన్ని టిడిపి రాజంపేట అధికార ప్రతినిధి ఆర్ జె వెంకటేష్ ప్రకటించారు. ఆదివారం చెక్కును ఎమ్మెల్యే షాజహాన్ బాషాకు అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మదనపల్లెలో ఎన్టీఆర్ విగ్రహ ఏర్పాటుకు విరాళాన్ని ప్రకటించిన ఆర్.జె.వెంకటేష్ కు ధన్యవాదాలు తెలిపారు. వచ్చే రెండు నెలలు లోపల విగ్రహాన్ని ఏర్పాటు చేసి ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా విగ్రహావిష్కరణ చేయిస్తామని అన్నారు. ఆనంతరం ఆర్‌జె మాట్లాడుతూ మదనపల్లెలో ఎన్‌టిఆర్ పూర్తిస్థాయి విగ్రహం లేకపోవుట చాలా బాధ అనిపించిందని, గత వైసిపి ప్రభుత్వంలోనే విగ్రహ స్థాపన చేయా లని డిమాండ్ చేసినట్లు తెలిపారు. దానిని కార్యరూపం దాల్చడంలో శాసనసభ్యుల కృషి ఎంతో ఉంటుందన్నారు. మదనపల్లి మున్సిపాలిటీ వైసిపి ఆదిపత్యంలో ఉన్నప్పటికీ ఎమ్మెల్యే చొరవ తీసుకుని విగ్రహ ఏర్పాటుకు ఏకగ్రీవ తీర్మానం చేయించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. సహకరించిన మున్సిపల్ ఛైర్ పర్సన్ మనూజరెడ్డి, వైస్ ఛైర్మన్ జింకా వెంకటాచలపతి, వార్డు కౌన్సిలరుకీ ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో నాదెళ్ల విద్యాసాగర్, గంగారపు రాందాస్ చౌదరి, నాదెళ్ల రమేష్, శివకృష్ణ, ఉదయ్ కుమార్, వేణుగోపాల్, నిమ్మనపల్లి మండల పార్టీ అధ్యక్షులు రమణ, సర్పంచ్ రమణ, మల్లప్ప, లక్ష్మన్న, చినబాబు, రాజన్న, సుజాత పాల్గొన్నారు.

ఎస్ఐపై కేసు నమోదు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

గుర్రంకొండ ఎఎస్ఐ మోసెస్ పై కేసు నమోదు చేసినట్లు మదనపల్లె టూటౌన్ ఎస్ఐ రవికుమార్ తెలిపారు. ఎస్ఐ కథనం మేరకు.. ఎఎస్ఐ మోసెస్ మదనపల్లె టూటౌన్ పోలీసు స్టేషన్ పరిధిలో నివాసం ఉంటున్నారని తెలిపారు. గత కొంతకాలంగా భార్య ఎస్తేర్‌రాణిని పట్టించుకోకపోవడమే కాకుండా అదనపకట్నం కోసం వేధిస్తున్నాడని బాధితురాలు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. సిఐ రామచంద్ర ఆదేశాలతో ఎస్ఐ విచారణ చేపట్టి భార్యను వేధింపులకు గురిచేస్తున్న ఎఎస్ఐపై 498ఎ సెక్షన్ కింద కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

కడప పెద్దదర్గాను సందర్శించిన నిస్సార్ అహమ్మద్

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

కడప అమీన్‌పీర్ పెద్ద దర్గాను మదనపల్లె నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జి నిస్సార్ అహమ్మద్ సందర్శించారు. ఉరుసు ఉత్సవంలో పాల్గొని చాదర్ సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా నిస్సార్ అహమ్మద్ మాట్లాడుతూ ఎంతో పవిత్రమైన, ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన కడప అమీన్ పీర్ దర్గా సందర్శన ఆధ్యాత్మిక చింతనకు ప్రసిద్ధి అన్నారు. ఈ నెల 16 నుంచి 21 వరకు జరుగుతున్న ఉత్సవాల్లో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. సామాన్య ప్రజలతో పాటు రాజకీయ నాయకులు, సినీ తారలు, క్రీడాకారులు ఇలా అన్ని రంగాలకు చెందిన వారు దర్గాను సందర్శించడం విశేషం అన్నారు. కుల, మత, భాష, ప్రాంతం అనే తారతమ్యం లేకుండా అన్ని వర్గాల ప్రజలు దర్గాను సందర్శించడాన్నిఅదృష్టంగా భావిస్తారన్నారు. అనంతరం మాజీ ఉప ముఖ్యమంత్రి అంజాద్‌బాష, ప్రముఖ గాయకుడు, మ్యూజిక్ డైరెక్టర్ ఏఆర్ రెహామాన్‌తో కలిసి చాదార్ అందించి, ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

పీఠాధిపతితో నిస్సార్ అహమ్మద్

ప్రజలకు అవగాహన కల్పిస్తున్న వెల్నెస్ ప్రతినిధులు

ఉచిత వెల్నెస్ సర్వేకు విశేష స్పందన

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

మండలంలోని బోయినపల్లి జడ్‌పి హైస్కూల్‌లో ఆదివారం తనుస్ న్యూట్రిషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వెల్నెస్ సర్వేకు విశేష స్పందన లభించింది. ఈ సర్వేలో భాగంగా విద్యార్థులు, గ్రామ ప్రజలకు ఆరోగ్యకరమైన జీవన విధానం, సమతుల్య ఆహారం గురించి అవగాహన కల్పించారు. నేటి సమాజంలో పెరుగుతున్న ఊబకాయం సమస్యపై ప్రత్యేక దృష్టి సారించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వెల్నెస్ కోచ్ సురేష్‌బాబు మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి విశేష స్పందన లభించిందని అన్నారు. కార్యక్రమంలో సురేష్‌బాబుతో పాటు శాంతకుమారి, విజయ్ చంద్ర, సుధాకర్, వెల్నెస్ కోచ్‌లు పాల్గొన్నారు.

రామ్మూర్తి నాయుడుకు 'ముక్కా' నివాళి

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

తిరుపతి జిల్లాలోని నారావారిపల్లిలోని ముఖ్యమంత్రి చంద్రబాబు సోదరుడు రామ్మూర్తి నాయుడు భౌతిక కాయానికి అడా చైర్మన్ ముక్కా రూపానందరెడ్డి నివాళులర్పించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ రామ్మూర్తి నాయుడు మృతి బాధాకరమని అన్నారు. చంద్రగిరి నియో జకవర్గంలో ఆయన లేని లోటు పార్టీకి తీరని లోటని అన్నారు. రూపానంద రెడ్డి తో పాటు స్థానిక టిడిపి నాయకులు సంస్కృతిక విభాగం రాష్ట్ర అధ్యక్షులు పంతగాని నరసింహ ప్రసాద్, కట్టా గుండ య్య నాయుడు, తిమ్మిశెట్టి మణి, వేణుగోపాల్ రెడ్డి పాల్గొన్నారు. **లక్కిరెడ్డిపల్లి :** సిఎంచంద్రబాబు సోదరుడు చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే నారా రామమూర్తి నాయుడు మృతి తీరని లోటు అని లక్కిరెడ్డిపల్లి మండలం టిడిపి మండల నాయకులు మదన్ మోహన్ పేర్కొన్నారు టిడిపి కార్యాలయంలో రామ్మూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన రామ్మూర్తి నాయుడు మృతి టిడిపి, చంద్రగిరి నియోజకవర్గ ప్రజలకు తీరని లోటుని పేర్కొన్నారు. కార్యక్ర మంలో యనమల మదనమోహన్‌తో పాటు దండే శ్రీను, హేమంత్, మక్బూథ్, ముక్తార్ అహ్మద్, గంట వెంకట కృష్ణయ్య, ఏటు జెడ్ విశ్వం, మల్లి, ఓబులేసు, అలీ, రియాజ్, డీలర్ అన్వర్ పాల్గొన్నారు.

ప్రముఖ న్యాయవాది నాగప్రసాద్ ఆకస్మిక మృతి

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

నాగప్రసాద్(ఫైల్ ఫొటో)

రాజంపేట పట్టణానికి చెందిన ప్రముఖ సీనియర్ న్యాయవాది ఆర్.నాగప్రసాద్ ఆదివారం అకస్మాత్తుగా మృతి చెందారు. పట్టణంలో నీతి, నిజాయితీగల న్యాయవాదిగా ఆయన గుర్తింపు పొందారు. సాయినగర్ లోని వారి స్వగృహం వద్ద ఆయన అభిమానులు పెద్ద ఎత్తున బారులు తీరి నివాళులు అర్పించారు. కలకడ మండలం లోని నడిమిచెర్ల గ్రామంలో సోమవారం ఆయనకు అంతిమ క్రియలు నిర్వహించనున్నట్లు ఆయన తనయుడు ఆర్.రెడ్డి ప్రవీణ్ తెలిపారు.

నగలు, నగదును రికవరీ చేయండి

-బాధితుడి వేడుకోలు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

తన నుంచి నగలు, నగదును చోరీ చేసిన దుండగులను త్వరగా పట్టుకొని తన నగలు, నగదను విడిపించాలని మండలంలోని నూనెవారిపల్లెకు చెందిన శ్రీనివాసులు పేర్కొన్నారు. ఆదివారం విలేకర్లతోమాట్లాడుతూ అక్టోబర్ 21న స్థానిక కొత్త బస్టాండ్ వద్ద గల ఐడిబిఐ బ్యాంకులో తాకట్టులో ఉన్న బంగారు విడిపించుకొని వస్తున్న తన నుంచి 15 తులాలు బంగారంతో పాటు రూ.1.5 లక్షలు గుర్తు తెలియని దుండగలు అపహరించారని అన్నారు. దొంగతనంకు సంబంధించి తాను పోలీసులను ఆశ్రయించి కేసు నమోదు చేయించినట్లు తెలిపారు. సిసి పుటేజీ ఆధారంగా దొంగలు రాజంపేట నుంచి తిరుపతి పట్టణంలోని అంకుర ఆస్పత్రి వరకు వెళ్లినట్లు వారిని గుర్తించడం జరిగిందని తెలిపారు. అయినా దొంగలను పట్టుకోవడంలో పోలీసులు నిర్లక్ష్యం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జరిగిన దొంగతనం వలన తమ కుటుంబంలో జరగాల్సిన శుభకార్యం కూడా ఆగిపోయిందని, ఇప్పటికైనా పోలీసులు విచారణ వేగవంతం చేసి బంగారు, నగదును రికవరీ చేసి తనకు న్యాయం చేయాలని కోరారు.

వృద్ధులకు దుప్పట్లు అందిస్తున్న దాతలు

వృద్ధులకు దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి-పీలేరు

చలికి వణుకుతున్న అనాథలు, వయో వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేసినట్లు మానవత సంస్థ చైర్మన్ వంగి మళ్ళ రామచంద్ర, అధ్యక్షులు శెట్టి సుబ్రహ్మణ్యం తెలిపారు. ఆదివారం వారు స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణం, రహదార్ల ప్రక్కల్లో చలిలో నిద్రపోతూన్న పేదలు, వృద్ధులను గుర్తించి దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిరుపేద, అనాథలు, వయోవృద్ధులను ఆదుకో వడం తమ మానవత స్వచ్ఛంద సంస్థ ప్రధాన లక్ష్య మని అన్నారు. తాము చేస్తున్న, చేపట్టనున్న సేవా కార్యక్రమాలకు ప్రజలు తమ వంతు సహాయ, సహకారాలను అందివ్వాలని కోరారు. కార్యక్రమంలో సంస్థ సభ

మొబైల్ ఆధార్ కేంద్రాలు ఏర్పాటు

ప్రజాశక్తి - ముద్దనూరు

స్థానిక మేజర్ గ్రామ పంచాయతీ సచివాలయంలో ఈనెల 19 నుంచి 22వ తేదీ వరకు ప్రత్యేక మొబైల్ ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు ఆదివారం ఎంపిడిఒ ముకుండారెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆధార్ అప్డేట్, ఫొటో, చిరునామా, వేలిముద్రలు, ఫోన్ నెంబర్ లింక్ చేసుకోవచ్చన్నారు.

అలరించిన నృత్య ప్రదర్శన

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

శిల్పారామంలో చిన్నారులు చేసిన నృత్య ప్రదర్శనలు ప్రేక్షకులను ఎంతగానో అలరించాయి. ఆదివారం సాయంత్రం వారాంతపు సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా డి.మల్లారెడ్డి, కె.మోహన్ రెడ్డి, శ్రీ లక్ష్మీ ఫైనాన్స్, ఎంఆర్ క్రియేటివ్ శ్రీగంధం ఫాంలాండ్స్ వారి సౌజన్యంతో సూర్య డ్యాన్స్ అకాడమీ, మదనపల్లి వారు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. ప్రేక్షకులు చిన్నారులను కరతాళ ధ్వనులతో ప్రోత్సహించి, అభినందించారు. కార్యక్రమంలో నృత్య శిక్షకుడు మాస్టర్ సూర్య, పరిపాలనా అధికారి సుధాకర్, సిబ్బంది పాల్గొన్నారు.ులు పోతంశెట్టి రమేష్, రహత్‌బాషా, సుధాకర్‌బాబు, అక్రంబాషా పాల్గొన్నారు.

పాముకాటుకు గురైన రైతు

ప్రజాశక్తి - ముద్దనూరు

మండలంలోని తిమ్మాపురం గ్రా మంలో ఆదివారం రైతు నంద్యాల చిన్న ప్రతాప్‌రెడ్డి తన పొలంలో అనపకాయలు కోస్తుండగా పాము కాటు వేసింది. హుటా హుటిన చికిత్స నిమిత్తం 108వాహనంలో ప్రొద్దుటూరు ఆసుపత్రికి తరలించారు.

శ్మశాన వాటిక ప్రహరీ ధ్వంసం

-రూ.4 కోట్ల విలువైన స్థలం కబ్జాకు యత్నం
- పరిశీలించిన రెవెన్యూ, పోలీసు సిబ్బంది

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల కేంద్రంలోని హిందూ శ్మశాన వాటిక ప్రహరీని గత ప్రభుత్వంలో స్థానిక సర్పంచ్ ఆకేపాటి శ్రీనివాసులు రెడ్డి ఆధ్వర్యంలో డిఎంఎఫ్ నిధులు రూ.5లక్షలతో నిర్మించారు. శనివారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులుజెసిబి లతో ప్రహరీ గోడను కూల్చి నాలుగు కోట్ల విలువైన స్థలాన్ని కబ్జా చేశారని స్థానిక సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి ముత్తయ్య ఆధ్వర్యంలో ఎస్ఐ మోహన్ కుమార్ గౌడ్, తహశీల్దార్ అరవింద కిషోర్ కి వినతిపత్రం సమర్పించారు. విచారణ జరిపి శ్మశాన వాటిక అన్య క్రాంతం చేసిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని సర్పంచ్ పంచాయతీ కార్యదర్శి వినతి పత్రంలో పేర్కొన్నారు. స్మశాన వాటికలను కూడా కబ్జా చేయడం ఏంటని పలువురు గ్రామ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ధ్వంసమైన ప్రహరీని తహశీల్దార్, పోలీసు సిబ్బంది పరిశీలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు

ధ్వంసమైన ప్రహరీని పరిశీలిస్తున్న రెవెన్యూ, పోలీస్ సిబ్బంది

చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. శ్మశాన వాటికపై ఇప్పటికైనా సంబంధిత అధికారులు వెంటనే స్పందించి మండల వ్యాప్తంగా ఉన్న శ్మశాన వాటిక లను కాపాడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని ప్రజలు పేర్కొన్నారు.

హోటళ్లలో ప్లాస్టిక్ వాడితే కఠిన చర్యలు : డిఎల్‌పిఒ

హోటల్‌లో తనిఖీ చేస్తున్న డిఎల్‌పిఒ నాగరాజ

ప్రజాశక్తి-కలకడ

హోటల్లో ప్లాస్టిక్ కవర్లు వాడితే యజమానులపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని మదనపల్లి డివిజనల్ పంచాయతీరాజ్ అధికారి నాగరాజ పేర్కొన్నారు. మండల కేంద్రమైన కలకడలో పలు హోటళ్లలో ప్లాస్టిక్ కవర్లు వాడుతున్నట్లు స్థానిక ప్రజలచే ఫిర్యాదులు రావడంతో మండల కేంద్రం కలకడలో హోటళ్లను ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు. బస్టాండ్ సమీపంలో ఉన్న వాసవి హోటల్, అభిరుచి హోటల్, భవాని హోటల్, ధ్యాన ప్రియ హోటల్‌ను ఆకస్మిక తనిఖీ చేశారు. హోటళ్లలో వాడుతున్న కవర్లను పరిశీలించి యజమానులకు హెచ్చరికలు జారీ చేసినట్లు తెలిపారు.ప్లాస్టిక్ కవర్లను స్వాధీనం చేసుకుని వారికి తగు సూచనలు సలహాలు ఇస్తూ హెచ్చరికలు జారీ చేసినట్లు ఆయన తెలిపారు.హెూటల్ యజమానులతో మాట్లాడుతూ మొదటిసారి పంచాయతీ కార్యదర్శి తనిఖీలు నిర్వహించినప్పుడు ప్లాస్టిక్ కవర్లు వాడుతున్నట్లు కనిపించినచో రూ.500 అపరాధ రుసుం, రెండోసారి సందర్శినప్పుడు ప్లాస్టిక్ కవర్లు కనిపించినచో రూ.1000, మూడవసారి కార్యదర్శి సందర్శించినప్పుడు హెూటల్లో ప్లాస్టిక్ కవర్లు కనిపిస్తే వారికి రూ.1500 అపరాద రుసుం వేస్తామని చెప్పారు. జరుగుతుందని తెలియజేశారు నాలుగోసారి కనబడితే హోటల్ యజమానులపై క్రిమినల్ కేసులు నమోదు చేయడమే కాకుండా హోటల్‌ను సీజ్ చేస్తామని చెప్పారు. నియోజకవర్గంలో ఉన్న మేజర్ పంచాయతీలలో హోటళ్లలో ప్లాస్టిక్ కవర్లు వాడకూడదని దీనిపై సంబంధిత కార్యదర్శులు ప్లాస్టిక్ నిషేధంపై ర్యాలీ నిర్వహించాల చర్యలు తీసుకోవాలని ఆదేశించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి వెంకటసుబ్బయ్య, పంచాయతీ కార్యదర్శి దేవేంద్ర పాల్గొన్నారు.

గాడిద పాల వ్యాపారంతో మోసపోయాం

-బతకలేమంటున్న బాధితులు

ప్రజాశక్తి- రైల్వేకోడూరు

గాడిదపాల వ్యాపారంతో తమిళనాడు చెందిన వ్యక్తి నుంచి మోసపోయామని మండలంలోని సమతానగర్ గ్రామానికి చెందిన లింగం దిన్నె శ్రీనివాసులు రెడ్డి, ఆయన భార్య ఆదిలక్ష్మి పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీవనోపాధికోసం గాడిదల పాలు వ్యాపారం చేసుకోవాలనే ఉద్దేశంతో దాదాపు 30 గాడిదలను తెచ్చి తమిళనాడు లోని తిరునల్వేలి బాబు అనే వ్యక్తితో గాడిద పాల వ్యాపారం చేశామని అన్నారు. దాదాపు 20 లక్షలు పైగా బ్యాంకు, వడ్డీ వ్యాపారుల వద్ద రుణం తీసుకున్నామని అయితే బ్యాంక్ అధికారులు బ్యాంకు రుణం చెల్లించాలంటూ నిత్యం వేధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.18 నెలలుగా ఎన్నోసార్లు తమిళనాడుకు చెందిన బాబు అనే వ్యక్తిని పాలు తీసుకున్న డబ్బు

కుటుంబ సభ్యులతో శ్రీనివాసులురెడ్డి

లు ఇవ్వాలని వేడుకున్నా కనికరం చూపలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఒక చెల్లని చెక్కును ఇచ్చారని, ఇంత వరకు దానిపై స్థితి గతులు ఏమీ లేవని అన్నారు. 2023 నుంచి గాడిదల పాల వ్యాపారం చేసి మోసపోయామని అన్నారు. అప్పుల వేధింపులతో బతకలేక పోతున్నామని ఇప్పటికైనా బ్యాంక్ అధికారులు కొంత వ్యవధిని ఇస్తే తప్పకుండా బ్యాంకు రుణాలను చెల్లిస్తామని వారు అన్నారు. తమకు ఇద్దరు కుమార్తెలు, కొడుకు ఉన్నారని వారి పోషణ కూడా భారమైందని పేర్కొన్నారు. జిల్లాలో తమలాగే మోసపోయిన వారు చాలామంది ఉన్నారని ప్రభుత్వం ఇలాంటి వారిపై దృష్టి సారించి తమకు న్యాయం చేయా లని కోరారు. లేనిపక్షంలో కుటుంబ సభ్యులం దరూ ఆత్మహత్య చేసుకునేందుకు సిద్ధంగా ఉన్నామని వారు కన్నీటి పర్యవంతమయ్యారు.

తెలుగు భాష వెలుగుతూనే ఉంటుంది

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

తెలుగు కవులను సన్మానిస్తున్న గ్రంథాలయ కమిటీ

తెలుగు ఓ వెలుగు.. తెలుగు భాషలో ఎంతోమంది కవులు, కళాకారులు, రచయితలు ఉన్నారని, వారి సేవలతో తెలుగు భాష వెలుగుతూనే ఉంటుందని ప్రముఖ వైద్యులు డాక్టర్ ఎంఎల్ నారాయణరెడ్డి తెలిపారు. జమ్మలమడుగు ప్రభుత్వ శాఖా గ్రంథాలయంలో ఆదివారం రాత్రి లైబ్రేరియన్ జింకా చంద్రశేఖర్ పర్యవేక్షణలో లైబ్రరీ డెవలప్‌మెంట్ కమిటీ అధ్యక్షుడు బండారు శ్రీనివాసులు ఆధ్వర్యంలో కవి సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఎంఎల్ నారాయణరెడ్డి మాట్లాడుతూ మన సంస్కృతికి అద్దంపట్టే నిలయం గ్రంథాలయం అన్నారు. తెలుగు భాషలో పద్య, గద్య కవితకు ఓ ప్రత్యేక స్థానం ఉందన్నారు. కవి అమీర్ మాట్లాడుతూ తెలుగు భాషలో సాహిత్య ప్రక్రియకు ఓ ప్రత్యేక స్థానం ఉందన్నారు. పరభాషా పదాలను తనలో ఆకళింపు చేసుకుంటూ తెలుగు సొగసు ఉట్టిపడేలా ముందుకు సాగుతూనే ఉంటుందని వివరించారు. పద్య రచయిత సురేష్ మాట్లాడుతూ తెలుగు సాహిత్యంలో సమస్యాపూరణానికి ఓ ప్రత్యేక స్థానం ఉందన్నారు. దత్తపది, కంద పద్యం, తేటగీతి తదితర వాటి గురించి వివరించారు. మధుబాబు మాట్లాడుతూ కవిత్వం రాయాలన్నా, రచన చేయాలన్నా ఎంతో కృషి చేయాలన్నారు. దర్పణం శ్రీనివాస్ రచించిన అలుగోగు కథలను గురించి చక్కగా సమీక్షించారు. దర్పణం శ్రీనివాస్ ఓ చక్కని కవిత గానం చేసి ఆహుతులను ఆకట్టుకున్నారు. కవి గొరిగె వెంకటేశ్వర్లు తను రచించిన వేంకటేశ్వర శతకంలోని పద్యాలను పాడి వినిపించారు. కార్యక్రమంలో లెక్చరర్ కృష్ణయ్య, రామయ్య, దాదా ఖలందర్, సుబ్బారెడ్డి,పాల్గొన్నారు.

జాతీయ నాయకుల పుస్తకాలు చదవాలి

ప్రజాశక్తి - మైదుకూరు(చాపాడు)

మైదుకూరు శాఖా గ్రంథాలయంలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా ఆదివారం ఉద్యమ నాయకులను గురించి స్మరించుకున్నారు. గ్రంథాలయ అధికారి శ్రీనివాసరావు మాట్లాడుతూ గ్రంథాలయంలో అన్ని వర్గాల వారికి ఉపయోగపడే పుస్తకాలు అందుబాటులో ఉన్నాయన్నారు. జాతీయ నాయకుల జీవిత చరిత్రను తెలిపే పుస్తకాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రతి ఒక్కరు ఖాళీ సమయంలో పుస్తక పఠనాన్ని అలవర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో పాఠకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు

ప్రజాశక్తి - చాపాడు

స్థానిక గ్రంథాలయంలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా విద్యార్థులకు ఆదివారం డ్రాయింగ్ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా శాఖ గ్రంథాలయ అధికారి జె.శివ శంకర్‌రెడ్డి మాట్లాడుతూ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా ప్రతిరోజు ఒక కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఆటల పోటీలు, డ్రాయింగ్ పోటీలను నిర్వహించి వారోత్సవాలలో చివరి రోజున బహుమతులు ప్రదానం చేస్తామన్నారు. ప్రతి ఒక్కరూ గ్రంథాలయానికి తరచు వస్తూ పుస్తక పఠనాన్ని అలవర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

శనగ, జొన్న, మినుము రైతుల్లో హర్షం

ప్రజాశక్తి - పెద్దముడియం

మండలంలో భారీ వర్షం పడింది. ఈ వర్షానికి రైతుల్లో హర్షం వ్యక్తమవుతోంది. రబీ సీజన్‌లో పదివేల ఎకరాల్లో శనగ, ఐదు వందల ఎకరాల్లో జొన్న, మూడు వందల ఎకరాల్లో మినుము సాగు చేసినట్లు వ్యవసాయ అధికారి అరుణ తెలిపారు. విత్తనం వేసి నెల రోజులు గడుస్తున్నా వాన చుక్క లేకపోవడంతో కాలువల ద్వారా మోటార్లతో పంటలకు నీళ్ల పారించేందుకు రైతులు సిద్ధమయ్యారు. ఈ విధానంతో రైతులకు ఎకరాకు ఏడు వేల రూపాయలు వ్యయం అవుతుంది. ఈ నేపథ్యంలో భారీ వర్షం కురవడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

రాష్ట్ర స్థాయికి ప్రొద్దుటూరు విద్యార్థి ఎంపిక

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

ప్రొద్దుటూరులోని తక్వా ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాలకు చెందిన ఖురేసి సుమయ్య షాకీర్ రాష్ట్రస్థాయి క్యాంప్‌నకు ఎంపికయ్యారు. విద్యార్థిని తక్వా పాఠశాలలో 8వ తరగతి చదువుతోంది. కేంద్ర ప్రభుత్వ సంస్థలైన ఎన్‌సిఈఆర్‌టి, ఎన్‌సియస్‌యం (నేష నల్ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ మ్యూసియమ్), విజ్ఞాన భారతి సంయుక్తంగా నిర్వహించిన జాతీయ స్థాయి సైన్స్ ప్రతిభాన్వేషణ పరీక్ష విద్యార్థి విజ్ఞాన్ మంథన్ (వివి యం) 2024–25లో కడప జిల్లా నుండి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు పాఠ శాల కర స్పాండెంట్ డాక్టర్ మహమ్మద్ షాకీర్ ఖురేషి తెలిపారు. రాష్ట్రస్థాయి క్యాంప్‌నకు ఎన్నికైన విద్యార్థిని కడప జిల్లా వివియం కో–ఆర్డినేటర్ రామిరెడ్డి శ్రీనివాసుల రెడ్డి, కరస్పాండెంట్ డాక్టర్ షాకీర్ ఖురేషి, ప్రధానోపాధ్యాయురాలు శిరీష, వివియం సెల్ కో–ఆర్డినేటర్ జయభారత్‌రెడ్డి, అధ్యాపకులు అభినం దించారు.

వరిలో తెగుళ్ల నివారణకు జాగ్రత్తలు తీసుకోవాలి

ప్రజాశక్తి - చాపాడు : వరి పంటలో తెగుళ్ళు అధికంగా ఉన్నాయని, రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని మండల వ్యవసాయ అధికారి మ్యాగీ సూచించారు. మండల పరి ధిలో కెసి, కుందూ నది పరిధిలో ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన వరి పంట వెన్ను దశలో ఉంది. పంటకు పలు రకాల తెగుళ్ళ సోకాయి. దీనిపై వ్యవసాయ అధికారి రైతులకు పలు సూచనలు చేశారు. వరి పంటలో పాముపొడ, పచ్చ దోమ అధికంగా ఉన్నాయన్నారు. వీటి నివారణకు ఎక్సా కోనజోల్ 400 మిల్లీ లీటర్లు ఎకరానికి, నెగిటోవా 80 గ్రాములు ఎకరాకు పిచికారి చేయాలన్నారు. పంటల సాగు ప్రారంభంలో విత్తనశుద్ధి చేసుకోవడం వలన తెగుళ్లను నివారిం చుకోవచ్చు అన్నారు. ప్రస్తుతం ఉన్న తెగుళ్లతోపాటు మెడ విరుపు సోకితే భీమ్ పిచికారి చేయాలని ఆమె సూచించారు.

ఇళ్ల మంజూరుకు దరఖాస్తులు చేసుకోండి

ప్రజాశక్తి - పులివెందుల రూరల్ : ప్రభుత్వ ఆదేశాలు ప్రకారం కొత్తగా ఇంటి మంజూరు కోసం అర్హులైన లబ్ధిదారులు దరఖాస్తులు చేసుకోవాలని ఆ శాఖ డిఇ సి.రమణారెడ్డి తెలిపారు. స్థానిక హౌసింగ్ కార్యాలయంలో సోమవారం నుంచి దర ఖాస్తు చేసుకోవచ్చునని పేర్కొన్నారు. తెల్ల రేషన్‌కార్డు, భార్యా, భర్త ఆధార్ కార్డులు, బ్యాంకు అకౌంట్ బుక్, ఆదాయ సర్టిఫికెట్ జిరాక్స్ కాపీలు తీసుకొని కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆన్‌లైన్‌లో అప్లోడ్ చేసేటప్పుడు, ఆధార్ లింక్ అయిన ఫోన్ నెంబర్‌కు ఓటీపీ వస్తుందన్నారు. దరఖాస్తుదారుడు ఆధార్ కార్డులో ఉన్న ఫోన్ నెంబర్ సెల్‌ను వెంట తీసుకెళ్లానని ఆయన తెలిపారు.

సభ్యత్వ నమోదుతో ప్రయోజనం

ప్రజాశక్తి - ఖాజీపేట : టిడిపి సభ్యత్వ నమోదుతో కార్యకర్తలకు అనేక ప్రయోజనాలు చేకూరుతాయని ఐటీడీపి మండల అధ్యక్షుడు పాపన మల్లికార్జునరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం రావులపల్లె పంచాయతీలోని పాటిమీదపల్లె గ్రామంలో టిడిపి సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేవలం వంద రూపాయలతో రెండేళ్లపాటు రూ.5లక్షలు ప్రమాద బీమా ఉంటుందన్నారు. టిడిపి నాయకులు దాసరి శ్రీనివాసులు, పాటిమీదపల్లె ఉపసర్పంచ్ దుగ్గిరెడ్డి లక్ష్మిరెడ్డి, బత్తుల శివ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు.

వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న మానవత సభ్యులు

'మానవత' ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం

ప్రజాశక్తి - లక్కిరెడ్డిపల్లి

గ్రామీణ ప్రాంత ప్రజలకు ఆరోగ్యాన్ని అందించడమే మానవత ధ్యేయమని మానవత వ్యవస్థాపకులు రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం స్థానిక నలంద ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ నందు ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ మానవత సేవా కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన లభించిందని అన్నారు. రాయచోటికి చెందిన వెంకటేశ్వర మల్టీ స్పెష్పాలిటీ ఆస్పత్రి కోణంపేటలో నూతనంగా నిర్మించిన ధన్వి నారాయణ హాస్పిటల్ వారి సహకారంతో రోగులకు వైద్య సేవలు అందించారని అన్నారు. అనంతరం కేంద్ర కమిటీ సభ్యులు ప్రసాద్ యాదవ్ మాట్లాడుతూ మానవత సేవా కార్యక్రమాల్లో భాగంగా ఉచితంగా బాడీ ఫ్రీజర్లను, శాంతిరథం, పాఠశాలల్లో విద్యార్థులకు నైతిక విలువ లపై అవగా హనా కల్పించడం, బహుమతులను ఇచ్చి ప్రోత్సాహించడం జరుగు తొందన్నారు. వైద్యశిబిరంలో డాక్టర్ వెంకటేశ్వరరెడ్డి, భువనేశ్వరి, స్వాతిరెడ్డి, జానకిరామ్, హరిశ్రీ, ఎలుగోటి శ్రావణి, ప్రసాదబాబు పాల్గొ న్నారు. కార్యక్రమంలో మానవత చెర్మెన్ బాలసుబ్రమణ్యం, జిల్లా కన్వీనర్ శివయ్య. ప్రెసిడెంట్ షఫీ నాయక్, రవిశంకర్, రాముడు, చైతన్యరెడ్డి, గోపాల్. సాయిచరణ్, రమణారావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డిపో మేనేజర్ బండ్ల కుమార్

ప్రతి ఉద్యోగి సమయపాలన పాటించాలి

ప్రజాశక్తి-పీలేరు

ప్రతి ఉద్యోగీ విధి నిర్వహణలో సమయపాలనను అనుసరిస్తూ తమ కర్తవ్యాన్ని పాటించాలని పీలేరు ఆర్‌టిసి డిపో మేనేజర్ బండ్లకుమార్ తెలిపారు. సమయపాలన మాసోత్సవాల ప్రారంభం సందర్భంగా ఆదివారం స్థానిక ఆర్టీసీ గ్యారేజ్ లో గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి కండక్టర్, డ్రైవర్ సమయానికి విధులకు రావాలని అన్నారు. గ్యారేజ్ లో మెకానిక్‌లు బస్సుల్లోని సాంకేతిక సమస్యలను పరిశీలించి సకాలంలో డ్రైవర్లకు అప్పగించాలని తెలిపారు. ఉద్యోగు లందరూ తమకు కేటాయించిన వేళల్లో విధులకు హాజరవ్వాలని కోరారు. కార్యక్రమంలో పలువురు డ్రైవర్లు, కండక్టర్లు, మెకానిక్‌లు, ఇతర ఉద్యోగులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు పిబిసి పనులు ప్రారంభం

ప్రజాశక్తి - సింహాద్రిపురం

పులివెందుల నియోజవర్గానికి ప్రధాన సాగునీటి వనరైన పులివెందుల బ్రాంచ్ కెనాల్(పిబిసి) కెనాల్ మరమతు పనులను అధికారులు చేపట్టారు. కాలువలోని గడ్డి, పిచ్చి మొక్కల తొలగింపునకు దాదాపు రూ.18 లక్షలతో అధికారులు టెండర్లు పిలిచి పనులను ప్రారంభించారు. గతంలో గడ్డి, ఇతర పిచ్చి మొక్కల కారణంగా దిగువ ప్రాంతానికి(చివరి ఆయకట్టుకు) నీరు సరఫరా సక్రమంగా సాగేది కాదు. అధికారులు చర్యలు తీసుకుని పనులు ప్రారంభించడం పట్ల ఆయకట్టు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా పులివెందుల బ్రాంచ్ కెనాల్ ఇఇ రాజశేఖర్ మాట్లాడుతూ కాలువలో పూడికను పూర్తిగా తొలగించడంతోపాటు ఇతర మరమతు పనులను సైతం త్వరితగతిన పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించామన్నారు. రైతుల అభ్యున్నతికి అహర్నిశలు కృషి చేస్తామన్నారు. అంతకుముందు పులివెందుల బ్రాంచ్ కెనాల్ జెఇ రవికిరణ్‌తో కలిసి పనులను పర్యవేక్షించారు.

క్రైం కార్నర్

బాధితుని వద్ద వివరాలు సేకరిస్తున్న కానిస్టేబుల్

తండ్రీకొడుకులపై దాడి

ప్రజాశక్తి- బి. కొత్తకోట

భూ వివాదంలో తండ్రీకొడుకులు, కోడళ్లపై ప్రత్యర్థులు ఇనుప రాడ్లతో దాడి చేసిన సంఘటన ఆదివారం బి.కొత్తకోట మండలంలో చోటుచేసుకుంది. సిఐ రాజారెడ్డి కథనం మేరకు.. బి. కొత్తకోట మండలం, కాండ్లమడుగు క్రాస్, కోటా ఊరులో కురబలకోట మండలం, సింగన్నగారిపల్లెకు చెందిన రైతు రామచంద్రకు 549 సర్వే నెంబర్‌లో రెండు ఎకరాలు భూమి ఉందన్నారు. ఎకరా భూమిలో ఉలవులు సాగు చేసారని, మరో ఎకరా భూమిని దుక్కి దున్నేందుకు కుటుంబ సభ్యులతో భూమి వద్దకు వెళ్ళారని చెప్పారు. భూమిని చదును చేసుకుంటూ, కంచె వేస్తుం డగా ఆ భూమిపై కన్నేసిన స్థానికులు టి.నారాయణ, కృష్ణప్ప, నాగరాజా, వెంకటేష్, సుధాకర్ అక్క డికి వెళ్ళి ఆ భూమి తమదని, దౌర్జన్యంగా కబ్జా చేసేందుకు యత్నించారని అన్నారు.భూ యజ మాని రామచంద్ర, కుమారులు భాస్కర్, భువనేశ్వరి దంపతులు, వేణుగోపాల్, లక్ష్మిదేవి దంపతులు వారి కబ్జాను అడ్డుకున్నారని తెలిపారు. ఆగ్రహించిన నారాయణ, కృష్ణప్ప ఇనుప రాడ్లు, కర్రలతో తండ్రి కొడుకులు, కోడళ్లపై విచక్షణ రహితంగా దాడిచేసి తీవ్రంగా గాయపరిచారని అన్నారు. దాడిలో తీవ్రంగా గాయపడిన బాధితులు మదనపల్లి జిల్లా ఆస్పత్రిలో చేర్పించారని చెప్పారు. సిఐ ఆదేశాలతో బాధితులను విచారించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

భవన నిర్మాణ మేస్త్రీ పై..

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

భవన నిర్మాణ మేస్త్రీపై కొందరు కక్ష పూరితంగా దాడి తీవ్రంగా గాయ పరచిన సంఘటన ఆదివారం మదనపల్లి పట్టణం, బసిని కొండలో జరిగింది. బాధితుని కథనం మేరకు.. బసినికొండ గ్రామ పంచాయతీ నిధులతో ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మాణ పనులను మేస్త్రి మురళికృష్ణ చేయిస్తున్నట్లు తెలిపారు. స్థానికంగా ఉన్న ఆర్‌టిసి శంకర్‌తో పాటు అతని కొడుకులు చిన్నా, కన్నా బంధువులు విక్రమ్, లోకేష్, ఆకుల కార్తీక్ లు మద్యం తాగొచ్చి పనులు చేయించడానికి నీవెవరంటూ దుర్భాషలాడుతూ దాడి చేసి చితక బాదారని అన్నారు. అడ్డుకున్న మురళీకృష్ణ భార్య గాయత్రి, కుమార్తె కీర్తిలను కూడా తిడుతూ దాడి చేసినట్లు చెప్పారు. బాధితుడిని కుటుంబ సభ్యులు స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తాలుకా తెలిపారు.